క్లుప్తంగా

ఘనంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న జెడ్పీటీసీ వెంకటనాయుడు, నాయకులు

కొమరోలు: మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గత రెండు రోజులుగా నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మేరుగ రవికుమార్, ఎంపీటీసీ తిరుపతిరాజు, నాయకులు చెన్నారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, చల్లా శివారెడ్డి, వెంగయ్యచౌదరి పాల్గొన్నారు.

కనుల పండువగా ఉరుసు మహోత్సవం

రాచర్ల: మండలంలోని అనుమలవీడు గ్రామంలో మస్తాన్‌వలి స్వామి ఉరుసు మహోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన జెండాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పాలకవీడు, గౌతవరం, గుడిమెట్ట, రాచర్ల, గిద్దలూరు పట్టణం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దర్గా నిర్వాహకులు రావిపాటి ఖాజానాయబ్‌రసూల్, రహ్మతుల్లా తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

మార్కాపురం: పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరం 29వ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా పూల కిరీటాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. మహాగణపతి, దత్తాత్రేయ మూర్తులకు పూజలు చేశారు. మందిర అధ్యక్ష కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, కోశాధికారి నాగరాజు, నాగ గోపి, కృష్ణమోహన్, కరీం, విజయ్, నాగేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక డీఈఈ బి.వి.శేషగిరిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని స్టేషన్‌రోడ్డు, నంద్యాల రోడ్డు, క్లబ్ రోడ్డు, ఫారెస్ట్ ఆఫీస్ వెనుకాల వీధి, గాంధీబొమ్మ సెంటర్, మెయిన్‌బజారు, మార్కెట్ ఏరియా, రామాలయం వీధుల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

రాచర్ల: మండలంలోని ఆకవీడు, జేపీ చెరువు సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు కారణంగా చోళ్లవీడు, చినగానిపల్లె, అచ్చంపేట, అరవీటికోట, కొత్తూరు గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ బి.శేషగిరిరావు, రాచర్ల ఏఈ బాలగురవయ్య తెలిపారు. ఆకవీడు, జేపీ చెరువు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

మాదిరెడ్డిపాలెంలో భూ వివాదం

● ఇరువర్గాల ఘర్షణలో ముగ్గురికి గాయాలు



గాయపడిన శ్రీకాంత్‌రెడ్డి

పొదిలి రూరల్: పొదిలి నగర పంచాయతీ పరిధిలోని మాదాలవారిపాలెంలో తలెత్తిన భూ వివాదం ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకోవడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పూర్వీకుల ద్వారా సంక్రమించిన భూమి విషయంలో గ్రామానికి చెందిన కొరివి రవిచంద్రారెడ్డి, మునగాల వెంకటేశ్వరరెడ్డి కుటుంబాల మధ్య గత ఐదేళ్లుగా పొదిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు విచారణలో ఉంది. శుక్రవారం ఉదయం భూమి విషయమై ఇరు కుటుంబాలు మాట్లాడుకునే క్రమంలో మాటామాటా పెరగడంతో ఘర్షణకు దారితీసింది. కొరివి రవిచంద్రరెడ్డి, కొరివి శ్రీకాంత్‌రెడ్డి, కొరివి వెంకట లక్షమ్మకు గాయాలు కావడంతో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాంత్‌రెడ్డిని ఒంగోలు తరలించగా, మిగిలిన వారు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని బాధితుల వాంగ్మూలం నమోదు చేశారు.

అక్రమాలకు చోటివ్వలేం..

మీకో దండం..!

- కూటమి నేతల తీరుతో తలపట్టుకుంటున్న రెవెన్యూ అధికారులు
- సెలవుపై వెళ్లి తిరిగి విధుల్లోకి చేరేందుకు విముఖత
- ఇటీవల లాంగ్ లీవ్ పెట్టిన పొదిలి తహసీల్దార్ కృష్ణారెడ్డి
- రెండు వారాలు లీవ్ పెట్టి తిరిగిరాని తర్లుపాడు ఎమ్మార్వో విజయభాస్కర్
- అర్జీల పరిష్కారం, సర్టిఫికెట్ల కోసం ప్రదక్షిణ చేస్తున్న ప్రజలు, విద్యార్థులు



తర్లుపాడు తహసీల్దార్ కార్యాలయం

తర్లుపాడు:

'అధికారం మాదే.. అధికారులు గంగిరెద్దుల్లా మా ముందు తలాడించాల్సిందే.. కాదూకూడదంటే మేమేంటో చూపిస్తాం' అచ్చు ఇలాగే ఉంది కూటమి నేతల వ్యవహార శైలి. గ్రామాలు మొదలు నియోజకవర్గ స్థాయి టీడీపీ నేతలు సైతం తమ అక్రమాలకు తలొగ్గాల్సిందేనంటూ చేస్తున్న ఒత్తిడితో వివిధ శాఖల అధికారులు తలపట్టుకుంటున్నారు. విధులు నిర్వర్తించడం కత్తి మీద సాములా మారడంతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోతున్నారు. ఇటీవల పొదిలి తహసీల్దార్ కృష్ణారెడ్డి లాంగ్ లీవ్ పెట్టి వెళ్లిపోవడంతో స్థానికంగా ప్రజలు, విద్యార్థులు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. పొదిలి ఇన్‌చార్జి ఎమ్మార్వోగా కొనకనమిట్ల తహసీల్దార్‌ను నియమించి ఉన్నతాధికారులు చేతులు దులిపేసుకున్నారు. ఇదే పరిస్థితి తర్లుపాడు మండలంలోనూ నెలకొంది. అధికార పార్టీ నేతల నుంచి వస్తున్న ఒత్తిళ్లను రెవెన్యూ అధికారులు భరించలేకపోతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన సహకారం లభించకపోవడంతో దీర్ఘకాలిక సెలవులపై వెళ్తున్నారు. గడిచిన సంవత్సర కాలంలో తర్లుపాడుకు ముగ్గురు తహసీల్దార్‌లు మారారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 2014–2019 మధ్య టీడీపీ అధికారంలో ఉండగా భూ రికార్డులను తారుమారు చేసిన కొందరు వ్యక్తులు కూటమి అధికారంలోకి రాగానే జూలు విదిల్చారు. అక్రమాలను సక్రమం చేసుకునే క్రమంలో భూములను ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ విజయభాస్కర్‌పై తీవ్రస్థాయిలో ఒత్తిడి చేయడంతో ఆయన 15 రోజులు సెలవుపై వెళ్లారు. సెలవు గడువు ముగిసినప్పటికీ విధుల్లో చేరకపోవడంతో ప్రజలు పలురకాలుగా చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా మండలంలోని కలుజువ్వలపాడు ఇలాకాలో కొందరు అధికార పార్టీ నాయకులు పశువుల మేత బీడు భూములను ఆన్‌లైన్ చేయాలంటూ ఒత్తిడి తెచ్చినట్టు రెవెన్యూ సిబ్బంది మధ్య చర్చ నడుస్తోంది.

సర్టిఫికెట్ల కోసం అవస్థలు

15 రోజులుగా తహసీల్దార్ సెలవుపై వెళ్లడంతో వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ముఖ్యంగా రైతులు తాము తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకునేందుకు అవసరమైన 1బీ, అడంగల్ కాపీలు, విద్యార్థులు క్యాస్ట్, ఇన్‌కం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పది, ఇంటర్ పరీక్ష ఫలితాలు వెల్లడి కావడంతో పైచదువులకు వెళ్లేందుకు విద్యార్థులు అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వేచి చూస్తున్నారు. డీఎస్సీ, పోస్టల్, గ్రూప్–2 అభ్యర్థులు సైతం వివిధ సర్టిఫికెట్ల కోసం గ్రామ సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సర్టిఫికెట్లు పొందాలంటే తప్పనిసరిగా తహసీల్దార్ సంతకం అవసరం. సెలవుపై వెళ్లిన తహసీల్దార్ తిరిగిరాకపోవడంతో వీరంతా మల్లగుల్లాలు పడుతున్నారు. తక్షణమే తహసీల్దార్‌ను నియమించి సమస్యలు పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు.

> **తహసీల్దార్‌ను నియమించాలి**
>
> 
>
> తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు, రైతులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో 1బీ, అడంగల్ రావడం లేదు. రైతులు తమ వ్యవసాయ రుణాలు రెన్యువల్ చేసుకోవాలంటే కచ్చితంగా తహసీల్దార్ సంతకం అవసరమవుతుంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వెంటనే తహసీల్దార్‌ను నియమించాలి.
>
> – పాపిరెడ్డి, రైతు సంఘ నాయకుడు, తర్లుపాడు

గ్రామాల్లో 70 సీసీ కెమెరాలు ఏర్పాటు



సీసీ కెమెరాల ఏర్పాటును పర్యవేక్షిస్తున్న ఎస్సై

మార్కాపురం: మార్కాపురం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కాలంలో మొత్తం 70 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు. శుక్రవారం వేములకోటలో 6 సీసీ కెమెరాల ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే జీజీహెచ్ వద్ద 2 కెమెరాలు, కోలభీమునిపాడులో 3, చింతగుంట్లలో 2, తిప్పాయిపాలెంలో 2, జమ్మనపల్లిలో 2, బోడపాడులో 2, రాయవరంలో 5, గజ్జలకొండలో 2, నాగులవరంలో 4, నికరంపల్లిలో 2, ఇడుపూరులో 2 ఇలా ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రూరల్ పోలీసుస్టేషన్ నుంచి అనుక్షణం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలు వినియోగిస్తామన్నారు. ఊళ్లకు వెళ్లేవారు విలువైన బంగారు ఆభరణాలు ఇంట్లో ఉంచవద్దని, ముందుగా పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు.

ఇంటర్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న వాసవీ క్లబ్ నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ కనబరచి 470కిగాను 465 మార్కులు సాధించిన విద్యార్థినిని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. పట్టణానికి చెందిన భవనాశి రామాంజనేయులు కుమార్తె వెంకట సాయిమోహిత సాహితి కాలేజీలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినితోపాటు ఆమె తండ్రిని క్లబ్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.రామచంద్రుడు, వాసవీ వనిత క్లబ్ ప్రెసిడెంట్ గర్రె సాహితి, ఆర్య వైశ్య సంఘం నాయకులు సూరే నాగేశ్వరరావు, మునగనూరి సత్యనారాయణ, కొప్పరపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ, జెడ్పీటీసీకి సేవా పురస్కారాలు





సేవా పురస్కారం అందుకుంటున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ నాయకులు కొనకనమిట్ల ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అక్కిదాసరి ఏడుకొండలు ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ స్వరాజ్య సాధన సమితి ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఒంగోలులో అభినందన కార్యక్రమం నిర్వహించారు. సమితి రాష్ట్ర కార్యదర్శి వీరభద్రాచారి చేతుల మీదుగా ఎంపీపీ, జెడ్పీటీసీకి పురస్కారాలు అందజేశారు. స్థానిక పార్టీ నాయకులు ఏలూరి సంజీవరెడ్డి, గోనుగుంట్ల శ్రీనివాసులు, నాగం ప్రసాద్, గాడి కోనేటిరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్లు కోటపాటి బ్రహ్మారెడ్డి, కోండ్రు వెంకటేశ్వర్లు, టంగుటూరి వెంకటరావు అభినందించారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



ఉప్పలపాడులో ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది



మార్కాపురంలో ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ పద్మావతి, వైద్య సిబ్బంది



పెదారికట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి

మార్కాపురం: మలేరియా లాంటి జ్వరాలు ప్రబలకుండా ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాత్రి పూట దోమతెరలు వినియోగించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో ఖాళీ కొబ్బరి బొండాలు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. తొట్లలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ శ్రవణ్‌తేజ, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసరు నాగేందర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు ఆవులయ్య, యశోద, పి.గోవిందరాజులు, పి.లక్ష్మీరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శుక్రవారం గొట్లగట్టు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి ఆవరణలో పాత టైర్లు, కుండలు, రోళ్లు, ఖాళీ కొబ్బరి బోండాలను తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నారాయణరెడ్డి, ఎంపీహెచ్ఎస్ జాజుల వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పొదిలి రూరల్: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉప్పలపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ సుగుణకుమార్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. ఇంటి పరిసరాల్లో మురుగు, డ్రమ్ముల్లో ఎక్కువ రోజులు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ స్నేహం అ'పూర్వ'ం



ఆత్మీయ వేడుకకు హాజరైన పూర్వ విద్యార్థులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సెయింట్ పాల్స్ బీఈడీ కళాశాలలో 1998–1999వ సంవత్సరంలో బీఈడీ చదివిన విద్యార్థులు శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆత్మీయంగా కలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కాలేజీ రోజులను మననం చేసుకుని సందడి చేశారు. కార్యక్రమంలో సెయింట్ పాల్స్ బీఈడీ కళాశాల అధ్యాపకులు రీటా సుగుణసుందరి, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శోభన్‌బాబు, ఆశాలత, పూర్వ విద్యార్థులు హనుమంతారెడ్డి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి హేయం



తర్లుపాడులో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న యువత



కంభం బస్టాండులో మానవహారంగా ఏర్పడిన ముస్లింలు

● ఉగ్ర దాడిని నిరసిస్తూ ముస్లింల శాంతి ర్యాలీ

మార్కాపురం టౌన్: జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గాంలో టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులకు నిరసనగా మార్కాపురంలో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మదీనా మసీదు, జామియా మసీదులో నమాజ్ అనంతరం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని 2 నిమిషాలు మౌనం పాటించారు. అలాగే శుక్రవారం రాత్రి ఎంపీజే, జేఐహెచ్, ముతవల్లి కమిటీ, ఉలేమాల కమిటీ తదితర ముస్లిం ప్రతినిధుల ఆధ్వర్యంలో కొవ్వొత్తు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదానికి మతంతో సంబంధం లేదని, టూరిస్టులను కాల్చి చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు.

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో స్థానిక యువత ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కంభం: జమ్ము కశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో కంభం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం పట్టణంలోని అన్ని మసీదుల ముస్లిం పెద్దలు, యువకులు జామియా మసీదు వద్దకు చేరుకుని అక్కడి నుంచి జాతీయ జెండాలు చేతపట్టి కంభం బస్టాండ్ వరకు శాంతి ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాల కోల్పోయినవారి ఆత్మకు శాంతి చేకూరాలని దువా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశంలో హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవిస్తున్నారన్నారు. ఉగ్రవాదాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించి, ముష్కరులకు సరైన గుణపాఠం చెప్పాలని కోరారు.



మార్కాపురంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు



మార్కాపురంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మేడేను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

మార్కాపురం టౌన్: ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మార్కాపురం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సీఐటీయూ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చే విధంగా చట్టాలను మార్పు చేయడాన్ని తప్పుబట్టారు. కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందన్నారు. సీఐటీయూ టౌన్ అధ్యక్షుడు సుబ్బరాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, మండల నాయకులు జమ్మున నాగరాజు, రామిరెడ్డి, భూలిక్ష్మి, కోటమ్మ, చెన్నకేశవులు, యూసఫ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.